


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :141 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ ఆదివారం 20-09-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## పర్యావరణ పరిరక్షణలో భారత్ కొత్త అడుగులు..



న్యూఢిల్లీ,ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ, పర్యావరణ సవాళ్లకు భారత్ పరిష్కారాలను అందిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్' అంతర్జాతీయ సదస్సును శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది.వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనేందుకు పునరుత్పాదక ఇంధనం, సౌరశక్తి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో భారత్ చేపడుతున్న చర్యలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించారు. గత 12 ఏళ్లలో భారత్ పునరుత్పాదక ఇంధన రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని మోదీ తెలిపారు. ప్రధానంగా సౌర విద్యుత్ సామర్థ్యం రెండు గిగావాట్ల నుంచి 160 గిగావాట్లకుపైగా పెరిగిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ విద్యుత్ అవసరాలను తీర్చడంలో పునరుత్పాదక ఇంధనం కీలక పాత్ర పోషిస్తోందని మోదీ చెప్పారు.కుసుమ్ పథకం కింద సుమారు 30లక్షల మంది రైతుల పొలాల్లో సౌర విద్యుత్ పంపులను ఏర్పాటు చేసినట్లు ప్రధాని తెలిపారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా కోట్లాది ఇళ్లలో ఎల్ఈడీ బల్బుల వినియోగం పెరగడం వల్ల విద్యుత్ ఆదాతో పాటు ఉద్గారాల తగ్గింపునకు కూడా సహకారం అందిందన్నారు. భారతదేశంలోని ప్రాచీన పర్యావరణ ఆలోచనలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ ముందుకు సాగుతున్నామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. పవన విద్యుత్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిందని, జల విద్యుత్ సామర్థ్యం కూడా గణనీయంగా విస్తరించిందని పేర్కొన్నారు.వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు భారత్ అంతర్జాతీయ స్థాయిలో పలు కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని మోదీ తెలిపారు. పారిస్ వాతావరణ ఒప్పందంలో భారత్ చేసిన కట్టుబాట్లను నిర్ణీత గడువుకు ముందుగానే సాధించిందని అన్నారు. జీ20 దేశాల్లో ఈ లక్ష్యాలను ముందుగానే పూర్తి చేసిన దేశంగా భారత్ నిలిచిందని పేర్కొన్నారు.ఇదిలాఉంటే.. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పాలన వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. 17 దేశాలకు చెందిన న్యాయమూర్తులు, న్యాయ ప్రతినిధులతో పాటు భారత్‌కు చెందిన సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, పర్యావరణ నిపుణులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు.

## కోస్గిలో తెలంగాణ రక్షణ సేన సంకల్ప సభ..పాలమూరు రాజకీయాలపై ఆసక్తి

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త రాజకీయ వేదికగా ఎదగాలని ప్రయత్నిస్తున్న తెలంగాణ రక్షణ సేన కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో ఆదివారం 'పాంచజన్య సంకల్ప సభ' నిర్వహించనుంది. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 20న మధ్యాహ్నం 2.30 గంటలకు కోస్గి కాలేజీ గ్రౌండ్‌లో సభ ప్రారంభం కానుంది. ఈ సభ ద్వారా పార్టీ విధానాలు, సామాజిక న్యాయం, అభివృద్ధి అంశాలపై కవిత తన రాజకీయ దిశను వివరించనున్నారు.

పాలమూరు తర్వాత.. కొడంగల్ వైపు

తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు తర్వాత కవిత చేపడుతున్న రాజకీయ పర్యటనల్లో కొడంగల్ సభకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటికే నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించిన పార్టీ.. తదుపరి కార్యక్రమంగా కోస్గిని ఎంచుకుంది. అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోనూ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కవిత ప్రకటించారు. ఇటీవల పార్టీ మరో 18 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. దీంతో రాష్ట్రంలోని 60 నియోజకవర్గాలకు సంస్థాగత బాధ్యతలు కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కోస్గి సభ పార్టీ విస్తరణ కార్యక్రమంలో మరో కీలక అడుగుగా మారింది.

'బహుజన తెలంగాణ'పై ఫోకస్

తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ కార్యాచరణలో సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ అధికారిక విధాన పత్రంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం అనే ఐదు అంశాలను 'పాంచజన్యం'లో భాగంగా పేర్కొంది. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళల సాధికారతకు విధానపరమైన ప్రాధాన్యం ఇస్తామని పార్టీ చెబుతోంది. బీసీలకు రిజర్వేషన్లు, విద్యా--వైద్య రంగాల్లో ప్రభుత్వ బాధ్యత, రైతులకు మద్దతు వంటి అంశాలను తన కార్యాచరణలో పొందుపరిచింది.

కొత్త రాజకీయ బ్లూప్రింట్ ప్రకటిస్తారా?

కోస్గి సభలో తెలంగాణ రక్షణ సేన భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై కవిత మరింత స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 'బహుజన తెలంగాణ' నిర్మాణం, సామాజిక న్యాయం, ఉద్యోగాలు, విద్య, వ్యవసాయం, రాష్ట్ర హక్కులు వంటి అంశాలపై పార్టీ వైఖరిని ప్రజల ముందుంచే అవకాశం ఉంది. పార్టీ ఇప్పటికే ప్రకటించిన విధానాల్లో పరిపాలనా సంస్కరణలు, సామాజిక న్యాయం, మహిళా సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు చోటు కల్పించింది.

పాలమూరు రాజకీయాలపై ప్రత్యేక దృష్టి



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కవిత గతంలోనూ సాగునీరు, కృష్ణా జలాల అంశాలను ప్రస్తావించారు. ఇప్పుడు అదే ప్రాంతంలోని కొడంగల్‌ను సభకు వేదికగా ఎంచుకోవడంతో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. కృష్ణా జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు, ప్రాంతీయ అభివృద్ధి వంటి అంశాలను తన రాజకీయ ప్రసంగాల్లో ప్రస్తావిస్తున్న కవిత.. కోస్గి సభలోనూ ఈ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. అయితే ఆయా అంశాలపై వివిధ పార్టీలకు భిన్నమైన వాదనలు ఉన్నందున.. సభలో వెలువడే రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే కవిత ప్రకటించే విధానాలు, కార్యాచరణ ప్రణాళికే ఈ సభకు ప్రధాన రాజకీయ అంశంగా మారనుంది.

రేవంత్ సొంత నియోజకవర్గంలో సభ

కొడంగల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం. దీంతో కోస్గిలో తెలంగాణ రక్షణ సేన నిర్వహిస్తున్న సభపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల కవిత కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పనితీరుపై విమర్శలు చేశారు. కొడంగల్ సభలోనూ రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై ఆమె మాట్లాడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 20 సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలకు సంబంధించిన వివరాలను ప్రజల ముందుంచుతానని కవిత గతంలో ప్రకటించారు.

పాంచజన్యం.. ఐదు అంశాల చుట్టూ రాజకీయ ప్రయాణం

తెలంగాణ రక్షణ సేన తన పేరుతో ప్రకటిస్తున్న 'పాంచజన్యం'ను కేవలం సభకు సంబంధించిన నినాదంగా కాకుండా, పార్టీ ఐదు ప్రధాన కట్టుబాట్లకు ప్రతీకగా వివరిస్తోంది. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం చుట్టూ పార్టీ రాజకీయ కార్యాచరణను నిర్మిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది. అందుకే కోస్గి సభలో కవిత ప్రసంగంతోపాటు పార్టీ ప్రకటించే తదుపరి కార్యాచరణపై కూడా ఆసక్తి నెలకొంది.

## రేవంత్ రెడ్డి లక్కీ భాస్కర్ సీఎం...

హైదరాబాద్, అసెంబ్లీ సమావేశాలు దుశ్శాసన పర్వాన్ని తలపించాయని.. ప్రధాన ప్రతిపక్షం గొంతు అసెంబ్లీలో వినిపించకుండాకుట్ర చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. వన్ సైడ్ అసెంబ్లీ సమావేశాలు జరుపుకుని ప్రజాస్వామ్య బద్ధంగా నడిపామని శ్రీధర్ బాబు అంటున్నారు. ఆత్మస్తుతి పరనింద తప్ప అసెంబ్లీలో ఏమీ జరగలేదు. 463 పేజీల క్యూర్ బిల్లును అర్ధ గంటలో పాస్ చేశారు. హామీల అమలులో విఫలం అనే టీ షర్టులు వేసుకుంటే తప్పు ఏంటి...? రాహుల్ గాంధీ రాతలు, ఫోటోలు ఉన్న టీ షర్టులు వేసుకుని ఎందుకు పార్లమెంట్ కు వెళ్లారు. దేశంలో అన్ని అసెంబ్లీలు పార్లమెంట్ సాంప్రదాయాలు పాటిస్తాయి. మమ్మల్ని అసెంబ్లీ గేటు వద్ద ఎందుకు ఆపారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి గొంతు నులిమిన పోలీసులపై ఎందుకు కేసు పెట్టలేదు. డీజీపీ ఆటవిక రాజ్యం నడుపుతున్నారు . చావు డప్పు పేరుతో కేసీఆర్ ఇంటిపై దాడి చేశారు. పోలీసులు రేవంత్ రెడ్డి తొత్తులుగా మారారు. రేవంత్ రెడ్డికి పెయిడ్ బ్యాచ్ లా పోలీసులు మారారని ఎమ్మెల్యే వేముల ఫైర్ అయ్యారు.మమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసి బీజేపీ వాళ్లను అసెంబ్లీలో పెట్టుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయ్యి అసెంబ్లీని నడిపించుకున్నారు. రేవంత్ రెడ్డి రిబ్బన్ రెడ్డిగా మారారు. బీజేపీతో కుమ్మక్కు అయ్యి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. రేవంత్ రెడ్డి గురువుకు డైవర్షన్ పాలిటిక్స్ చేయడం అలవాటన్నారు.

కేటీఆర్ ఇచ్చిన ఆఫర్ కు రేవంత్ రెడ్డి సిద్ధమా...?

కేసీఆర్ కుటుంబం ఆస్తులు, రేవంత్ రెడ్డి కుటుంబం ఆస్తులపై సుప్రీంకోర్టు



సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధంగా ఉన్నారా..? అని ఎమ్మెల్యే వేముల ప్రశ్నించారు. కేసీఆర్ 300 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదని తేలితే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా...? కేసీఆర్ 300 ఎకరాల భూమి కబ్జా చేశారని తేలితే మేము అంతా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాం. కేటీఆర్ ఇచ్చిన ఆఫర్ కు రేవంత్ రెడ్డి సిద్ధమా...? అని సవాల్ విసిరారు.భూముల వద్దకు వెళ్ళడానికి కాంగ్రెస్ ఎంపీలు,ఎమ్మెల్సీలకు ఏం సంబంధమని వేముల ప్రశ్నించారు. జన్వాడ భూముల వద్దకు వెళ్లడానికి ప్రజా భవన్ లో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు రెడీగా ఉన్నారు. కేసీఆర్,కేటీఆర్,హరీష్ భూముల వద్దకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను పంపడానికి రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. మన్నే క్రిశాంక్ ఇంటి తాళాలు పగలగొట్టారు.. మీరు పోలీసులా..? దొంగలా..? రేవంత్ రెడ్డి కుటుంబం అవినీతి బయటకు రావద్దని ఇదంతా చేస్తున్నారు.

## రేవంత్-కేటీఆర్ మైత్రి ఏంటో ప్రజలకు తెలుసు: బండి సంజయ్



హైదరాబాద్, సెప్టెంబర్ 19: సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు.మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య మైత్రి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. సర్వే నంబర్లతో సహా చెప్పి కేటీఆర్ బాధపడకుండా ఉండేలా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా పొలిటికల్ డ్రామాలు చేస్తూ ఎంపీలు, ఎమ్మెల్సీలను పంపి తమాషాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. వాళ్లు వెళ్లేది ఎందుకు హద్దులు కొలవడానికా అని ప్రశ్నించారు. ఏఐసీసీకి ముడుపులు ముట్టక సమస్య సైడ్ ట్రాక్ అవుతోందని అన్నారు. ముందు కేసీఆర్ కుటుంబంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.కేటీఆర్ సుద్దపూస మాటలు ఆపాలని కేంద్ర మంత్రి అన్నారు. పొత్తూర్ లాజిస్టిక్ పార్క్ నడుపుతోంది కేటీఆర్ అని.. కొంతమందితో కలిసి హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుతున్నారని తెలిపారు. ఖానాపూర్‌లో టికెట్ మార్చడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఒకప్పుడు ఆంధ్ర అడ్వాకేట్లు అన్న కేటీఆర్.. ఇప్పుడు వాళ్లతోనే ఎందుకు గడుపుతు న్నారని నిలదీశారు. ఈరోజు రోజ్‌గార్ మేళా ద్వారా రెండు వందల మందికిపైగా ఉద్యోగ పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలలో నిరుపేద బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యం అవుతుందన్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఆ ఎన్నికలో బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భవిష్యత్‌పై చర్చ

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో.. ఇప్పుడు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితిపై ఆసక్తి నెలకొంది. దానం కేసులో వచ్చిన తీర్పు నేపథ్యంలో మిగిలిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపై కూడా చర్చ మొదలైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో దానం నాగేందర్ కేసు ప్రత్యేకంగా మారింది. కారణం.. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం. ఈ అంశంపై కోర్టు కీలకంగా పరిగణించినట్లు తెలుస్తోంది.

10 మంది ఎమ్మెల్యేల వలస.. ఇప్పుడు అందరి చూపు వారిపైనే

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల సంఖ్య పదిగా ఉంది. వీరిలో దానం నాగేందర్‌పై హైకోర్టు తీర్పు వెలువడగా.. మిగిలిన ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్‌పై చర్చ కొనసాగుతోంది.

దానం కేసు.. మిగతా కేసులకు తేడా ఏంటి?

దానం నాగేందర్ వ్యవహారంలో ప్రధానంగా ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం కీలక అంశంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ మరో పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగడం వల్ల ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలో ఆయనపై పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే మిగిలిన ఎమ్మెల్యేల విషయంలో పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. తాము అధికారికంగా పార్టీ మారలేదని, కేవలం ప్రభుత్వానికి మద్దతుగా వ్యవహరిస్తున్నామని కొందరు ఎమ్మెల్యేలు గతంలో స్పష్టం చేశారు. ఈ అంశాలపై స్పీకర్ నిర్ణయాలను సవాల్ చేస్తూ న్యాయపోరాటం కొనసాగుతోంది.

కడియం శ్రీహరి పేరుపై చర్చ ఎందుకు?

దానం నాగేందర్ తర్వాత ఎక్కువగా వినిపిస్తున్న పేరు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరడం, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారంలో పాల్గొనడం వంటి అంశాలను బీఆర్ఎస్ నేతలు ప్రస్తావిస్తున్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్



మున్షీ సమక్షంలో కార్యక్రమం జరిగినట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అనంతరం వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ఆయన ప్రచారం చేశారు. ఈ పరిణామాలను ఆధారాలుగా చూపిస్తూ బీఆర్ఎస్ న్యాయపోరాటాన్ని కొనసాగిస్తోంది.

మహిపాల్‌రెడ్డి విషయంలో మారిన పరిణామం

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విషయంలో మాత్రం రాజకీయ పరిస్థితి మారింది. ఆయన తిరిగి బీఆర్ఎస్ వైపు వచ్చారు. దీంతో మిగిలిన ఎమ్మెల్యేల అంశంతో పోలిస్తే ఆయన వ్యవహారం భిన్నంగా మారింది.

బీఆర్ఎస్ వ్యూహం.. కోర్టులో పోరాటం

దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పు నేపథ్యంలో మిగిలిన ఎమ్మెల్యేలపై కూడా బీఆర్ఎస్ తన న్యాయపోరాటాన్ని వేగవంతం చేయాలని భావిస్తోంది. పార్టీ మార్పును నిరూపించే ఆధారాలు ఉన్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు, కాంగ్రెస్ వర్గాలు మాత్రం ఎమ్మెల్యేల చేరికలు చట్టపరమైన పరిధిలోనే జరిగాయని చెబుతున్నాయి. ఫిరాయింపుల అంశంపై తుది నిర్ణయం న్యాయస్థానాలు, రాజ్యాంగ నిబంధనల ప్రకారమే ఉంటుందని పేర్కొంటున్నాయి.

తీర్పు ప్రభావం ఎంతవరకు?

దానం నాగేందర్ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో కీలక చర్చకు దారితీసింది. అయితే ప్రతి ఎమ్మెల్యే కేసు వాస్తవాలు, ఆధారాలు, న్యాయపరమైన అంశాల ఆధారంగా విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. అందువల్ల దానం తరహాలోనే అందరికీ ఒకే విధమైన నిర్ణయం వస్తుందని ఇప్పుడే చెప్పలేం. ఆయా కేసుల్లో కోర్టుల పరిశీలన, ఆధారాలు, రాజ్యాంగ నిబంధనల ఆధారంగానే తదుపరి పరిణామాలు ఆధారపడి ఉంటాయి.

## భూముల లెక్కలపై కాంగ్రెస్ ఫోకస్!

హైదరాబాద్,జన్వాడ ఫామ్‌హౌస్ వ్యవహారం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూముల వివరాలు, యాజమాన్య హక్కులు, భూముల రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం శనివారం జన్వాడకు చేరుకుంది. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ప్రజాభవన్ నుంచి ప్రత్యేక బస్సులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కాంగ్రెస్ నేతలు జన్వాడకు బయలుదేరారు. ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూముల వివరాలను పరిశీలించడంతో పాటు, వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, భూముల కేటాయింపులు తదితర అంశాలను పరిశీలిస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

గేటు వద్దకు కాంగ్రెస్ బృందం

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఫామ్‌హౌస్ గేటు వద్దకు చేరుకోవడంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రైవేట్ ఆస్తిలోకి అనుమతి లేకుండా ప్రవేశించరాదంటూ ఫామ్‌హౌస్ పరిసరాల్లో బోర్డులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ నేతల పర్యటన



## సంపాదకీయం

**ఆదివారం 20-09-2026**

### యూసీసీకి గ్రీన్ సిగ్నలా... రెడ్ సిగ్నలా

ఉమ్మడి పౌరస్మృతి విషయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. 2029 లోక్ సభ ఎన్నికలకు ముందే దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో దీనిని అమలు చేస్తామని అత్యంత కీలక ప్రకటన చేశారు. ముంబైలో 'సేవా సంకల్ప అభియాన్' సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. తాము అనేక రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతిని ప్రవేశపెట్టామని, 2029 నాటికి ఎన్డీయే అధికారంలో వున్న మొత్తం 21 రాష్ట్రాల్లో యూసీసీని కూడా అమలు చేస్తామన్న నమ్మకం తమకు వుందన్నారు. ఉమ్మడి పౌర స్మృతి అమలుపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఎన్డీఏ పాలిత 21 రాష్ట్రాల్లో యూసీసీని అమలు చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. బీజేపీ చిరకాల రాజకీయ అజెండాల్లో ఒకటైన యూసీసీని ఈసారి కేంద్ర చట్టం ద్వారా కాకుండా.. రాష్ట్రాల మార్గంలో ముందుకు తీసుకెళ్లే వ్యూహాన్ని ఎంచుకుంది. యూసీసీపై బీజేపీ చాలా కాలంగా తన వైఖరిని స్పష్టం చేస్తూ వస్తోంది. దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన పౌర చట్టం ఉండాలన్నది ఆ పార్టీ వాదన. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్లమెంట్ ద్వారా ఒకేసారి జాతీయ స్థాయి చట్టం తీసుకురావడం కంటే.. రాష్ట్రాల శాసనసభల ద్వారా యూసీసీని విస్తరించడం వ్యూహాత్మక నిర్ణయంగా కనిపిస్తోంది. యూసీసీ పరిధిలోకి వచ్చే వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, కుటుంబ చట్టాలకు సంబంధించిన అంశాలు రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా లో ఉన్నాయి. ఈ అంశాలపై కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చట్టాలు చేసే అవకాశం ఉంది. ఈ రాజ్యాంగ వెసులుబాటును ఉపయోగించుకుని రాష్ట్రాల వారీగా యూసీసీ అమలు చేయాలని బీజేపీ భావిస్తోంది. రాష్ట్రాల స్థాయిలో చట్టాలు తీసుకురావడం వల్ల ఆయా ప్రాంతాల సామాజిక పరిస్థితులు, సంప్రదాయాలు, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుందని బీజేపీ భావిస్తోంది. భవిష్యత్‌లో ఈ రాష్ట్రాల నమూనాలు జాతీయ స్థాయి యూసీసీకి పునాదిగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్ మరియు ఉత్తరప్రదేశ్‌లతో సహా 19 రాష్ట్రాలు మరియు రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికారంలో ఉంది. ఉత్తరాఖండ్, గుజరాత్ మరియు అస్సాం రాష్ట్రాలు ఇప్పటికే ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయగా, మధ్యప్రదేశ్ దీనికి సంబంధించిన ముసాయిదాను రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అయితే.. కొన్ని రాష్ట్రాల్లో కూటమిగా బీజేపీ అధికారంలో వుంది. ఉదాహరణకు ఏపీని తీసుకుందాం. ఇక్కడ తెలుగుదేశం, జనసేనతో కలిసి కూటమిగా బీజేపీ అధికారాన్ని పంచుకుంటోంది. శంలో తొలిసారిగా ఉత్తరాఖండ్ రాష్ట్రం యూసీసీ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 2025 జనవరి నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టం వివాహం, విడాకులు, వారసత్వం, ఆస్తి హక్కులు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల వంటి అంశాలను పరిధిలోకి తీసుకుంది. తర్వాత గుజరాత్, అసోం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు యూసీసీ బిల్లులను ఆమోదించాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు కూడా ఈ దిశగా కసరత్తు ప్రారంభించాయి. ప్రస్తుతం రాష్ట్రాల యూసీసీ చట్టాల్లో ప్రధానంగా వివాహాల తప్పనిసరి నమోదు, విడాకుల నిబంధనలు, వారసత్వ హక్కులు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల నమోదు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు బహుభార్యత్వంపై నిబంధనలు, కుటుంబ చట్టాల్లో మార్పులను కూడా ప్రతిపాదిస్తున్నాయి. అయితే అన్ని రాష్ట్రాల్లో యూసీసీ చట్టాలు ఒకే విధంగా ఉండటం లేదు. ఆయా రాష్ట్రాల సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల్లో తేడాలు ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఒకే విధమైన పౌర చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలని సూచిస్తుంది. అయితే ఇది ఆదేశిక సూత్రాల్లో భాగం మాత్రమే కావడంతో నేరుగా అమలు చేయాల్సిన ప్రాథమిక హక్కు కాదు. అలాగే బిహార్ లో కూడా. అయితే. ప్రాంతీయ పార్టీలు లౌకికత్వం అన్న ఎజెండాతో ముందుకు సాగుతున్నాయి. ప్పటివరకు తాము ఉమ్మడి పౌర స్మృతిపై ఎలాంటి చర్చ జరపలేదని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. అవసరమైనప్పుడు దానిని పరిశీలిస్తామని ఆయన వివరించారు. మరోవైపు జనతా దళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా స్పందిస్తూ.. యూసీసీ అమలుకు ముందు అమిత్ షాను కలిసి చర్చిస్తానని పేర్కొన్నారు. ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ గతంలో ఉమ్మడి పౌర స్మృతి విధానానికి మద్దతిచ్చారు. అయితే అన్ని వర్గాలతో చర్చించాకే దాన్ని అమలు చేయాలని చెప్పారు. అలాగే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వివిధ వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర చర్చలు జరిపాకే యూసీసీపై తమ వైఖరిని వెల్లడిస్తామని తెలిపారు. మరో వైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సవాల్ విసిరారు. 2029 నాటికి ఎన్డీయే పాలిత ప్రాంతాల్లో ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) అమలు చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఓవైసీ తీవ్రంగా స్పందించారు. “మీకు ధైర్యం ఉంటే, ముందుగా గోవాలో యూసీసీని అమలు చేయండి” అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశం వంటి విభిన్న సంస్కృతులు, విలక్షణ సంప్రదాయాలు కలిగిన దేశంలో అందరికీ ఒకే రకమైన చట్టాన్ని రుద్దడం సాధ్యం కాదని ఓవైసీ అభిప్రాయపడ్డారు. యూసీసీని తీసుకురావడం వల్ల రాజ్యాంగం గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక వర్గాలకు కల్పించిన హక్కులకు, రక్షణకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తోందని ఓవైసీ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గోవాలో ఇప్పటికే కాథలిక్కులు, ఇతర వర్గాలకు వ్యక్తిగత చట్టాల్లో మినహాయింపులు ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, ఆ మినహాయింపులను తొలగించకుండా దేశవ్యాప్తంగా యూసీసీని ఎలా అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. యూసీసీ విషయంలో బీజేపీకి ఆ పార్టీలు కలిసొస్తాయా? లేదా.. మెలిక పెడతాయా? అన్నది చూడాలి.

# కీలక నేతలు గుడ్ బై...




విశాఖపట్టణం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతలంతా వరుసగా గుడ్‌బై చెబుతుండటం, మౌనం వహించడంతో అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు. బెంగళూరు నుంచి తాడేపల్లికి తిరిగొచ్చిన జగన్ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాంలను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో శ్రేణులకు ధైర్యం చెప్పేందుకు ఈ అత్యవసర భేటీలను నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ప్రధానంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు ..పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చేసిన ప్రకటనపై చర్చ జరిగింది. సాధారణంగా పార్టీ గీత దాటి మాట్లాడే నేతలను దూరంగా పెట్టే జగన్, ఈసారి మాత్రం విభిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. వ్యాఖ్యలు ఎలా ఉన్నా, ప్రస్తుతం పార్టీ సీనియర్లను కాపాడుకోవడమే ప్రాధాన్యంగా భావించిన జగన్..పార్టీలో అంతర్గత పోరును పరిష్కరిస్తానని చెప్పకుండా.. ఎవరైనా ఏమనుకున్నా సరే, రాబోయే ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా నీకే హామీ ఇస్తున్నా అని తమ్మినేనితో నేరుగా చెప్పినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోనూ జగన్ విడిగా భేటీ అయ్యారు. విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స తీరుపై రకరకాల చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నికల దిశగా పూర్తి స్పష్టత ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ పోరులో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలని అధినేత తేల్చిచెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా క్యాడర్‌ను సమాయత్తం చేసుకోవాలని సూచించారు. అయితే, అధినేత ఆఫర్ చేసిన టికెట్ల హామీలపై ఈ ఇద్దరు సీనియర్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. ప్రస్తుతం రీజియన్‌లో ఒకట్రెండు సీట్లు కూడా గెలిచే వాతావరణం కనిపించనప్పుడు, ఇప్పటి నుంచే ఈ సీట్ల ఖరారు వల్ల ప్రయోజనం ఏంటనే నిరాశ వారిలో కనిపిస్తోందని భావిస్తున్నారు. అందుకే ఈ సమావేశం ముగిసిన తర్వాత కూడా బొత్స గానీ, తమ్మినేని గానీ మీడియాతో ఏమీ మాట్లాడలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం విచిత్రమైన రాజకీయ వాతావరణం నెలకొంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను నడిపించిన తీరు, నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరిస్తున్న వ్యూహాలు పార్టీని మరింత నిరాశలోకి నెడుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో బలమైన నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై చాపరం భూకబ్జా కేసు నమోదు అయింది. . హైకోర్టు వారికి తాత్కాలిక ఊరట నిచ్చింది. అయితే, కూటమి ప్రభుత్వ హయాంలో పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ అరెస్టు కాకపోవడమే నేరమైనట్లు వైసీపీ అధిష్టానం భావించడం విడ్డూరంగా మారింది. అరెస్టు కాకుండా తప్పించుకున్నారంటే వారు కూటమి ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లేనని, కోవర్టులుగా మారిపోయారనే ముద్ర వేస్తున్నారు. ఈ అనుమానాల రాజకీయం కేవలం తమ్మినేని కుటుంబానికే పరిమితం కాలేదు. గతంలో వైఎస్సార్‌సీపీకి మూలస్తంభంగా ఉండి, ఇటీవలే రాజీనామా చేసి బయటకు వచ్చిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కూడా సరిగ్గా ఇదే తరహా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు అందరు కీలక నేతలపై ఏదో ఒక కేసు నమోదు కావడం లేదా అరెస్టులు జరగడం జరుగుతుంటే.. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డిపై మాత్రం ఎలాంటి కేసులు, అరెస్టులు ఎందుకు నమోదు కావడం లేదని విజయసాయిరెడ్డి నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టానికి అతీతంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న సజ్జల, ఇప్పుడు కూడా ఎలాంటి చిక్కులు లేకుండా బయటపడటం కోవర్టు రాజకీయమే కాదా అన్న ప్రశ్నను ఆయన అధిష్టానం ముందే ఉంచారు. వైసీపీ అధిష్టానానికి మొదటి నుంచీ ఒక అలవాటు ఉందనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రాణపణంగా నిలిచే సీనియర్ నేతలను సైతం.. చిన్నపాటి అనుమానం రాగానే వెన్నుపోటుదారులు గా ముద్రవేసి పక్కన పెట్టేస్తారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను వంటి పలువురు సీనియర్లు పార్టీకి దూరం కావడం వెనుక ఈ అధిష్టానం అనుమానాస్పద వైఖరి ప్రధాన పాత్ర పోషించింది. ఇప్పుడు శ్రీకాకుళంలో తమ్మినేని వర్గాన్ని కూడా పార్టీ సమావేశాలకు పిలవకుండా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి రాజకీయంగా ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ధోరణి వల్ల సీనియర్లు తమ ఆత్మాభిమానం కోసం ప్రత్యామ్నాయ దారులు చూసుకోవడం అనివార్యమవుతోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం వైసీపీలో ఉన్న ఈ బలహీనతను పక్కాగా వాడుకుంటోందనే విశ్లేషణలు వస్తున్నాయి. సీనియర్ నాయకులపై కేసులు నమోదు చేయడం , కొంతమంది విషయంలో చట్టపరమైన ప్రక్రియను సాగదీయడం ద్వారా వైసీపీ అధిష్టానంలో గందరగోళాన్ని సృష్టించడంలో కూటమి వ్యూహాత్మకంగా సఫలమవుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పటికీ, ఫలానా నేతను అరెస్టు చేయలేదంటే ఆయన తమతో కుమ్మక్కయ్యాడు అనే సందేశం వైసీపీ క్యాంపులోకి వెళ్లేలా మైండ్ గేమ్ ఆడటంలో అధికార పక్షం పైచేయి సాధిస్తోంది. ఆ ఉచ్చులో పడిన వైసీపీ నేతలు సొంత పార్టీ క్యాడర్‌లోనే అనుమానాల దావానాలాన్ని రగిల్చి నేతలను రోడ్డున పడేస్తున్నారు. అనుమానపు పక్షి కరిచిన చందంగా తయారైన వైసీపీ పరిస్థితి వల్ల దశాబ్దాలుగా పార్టీకి అండగా నిలిచిన క్షేత్రస్థాయి నాయకత్వం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రతి చిన్న అంశాన్ని కోవర్టు కోణంలోనే చూస్తే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీలో మిగిలేది కొద్దిమంది చుట్టూ ఉన్న కోటరీ మాత్రమే తప్ప, ప్రజాక్షేత్రంలో నిలబడే నాయకులు ఉండరనేది పచ్చి నిజం

## హైదరాబాద్ గణేష్ నిమజ్జనం.. ఈసారి రూల్స్ ఇవే.. ట్యాంక్‌బండ్‌పై భారీ ఆంక్షలు

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో గణేష్ నిమజ్జన వేడుకలకు అధికార యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా హుస్సేన్‌సాగర్ చుట్టూ నిమజ్జన నియమావళి, పర్యావరణ పరిరక్షణ చర్యలు ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. న్యాయస్థానాల ఉత్తర్వుల ప్రకారం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలను సహజ నీటి వనరుల్లో కాకుండా ప్రత్యేకంగా నిర్మించిన 'బేబీ పాండ్స్' కృత్రిమ చెరువులులోనే నిమజ్జనం చేయాలని అధికారులు స్పష్టం చేశారు. అలాగే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి వైపు నుంచి విగ్రహాలను నేరుగా హుస్సేన్‌సాగర్‌లో వేయకుండా పోలీసులు కఠిన ఆంక్షలు అమల్లోకి తెచ్చారు.

**ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు ఎందుకు?**

హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి సంబంధించి గతంలోనే న్యాయస్థానాలు పలు ఆదేశాలు జారీ చేశాయి. 2021లో తెలంగాణ హైకోర్టు పీఓపీ విగ్రహాల నిమజ్జనంపై ఆంక్షలు విధించింది. అదే ఏడాది సుప్రీంకోర్టు ప్రత్యేక పరిస్థితుల్లో ఒకసారి పీఓపీ విగ్రహాల నిమజ్జనానికి అనుమతించింది. అనంతరం 2023లో తెలంగాణ హైకోర్టు సహజ నీటి వనరుల్లో పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయకూడదని.. ఇందుకోసం కృత్రిమ లేదా బేబీ పాండ్స్‌ను వినియోగించాలని ఆదేశించింది. అయితే ట్యాంక్‌బండ్ నిబంధన, పీఓపీ నిబంధన రెండూ వేర్వేరు. పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఉన్న మట్టి లేదా ఇతర అనుమతించబడిన విగ్రహాలను హుస్సేన్‌సాగర్ వద్ద నిర్దేశిత ప్రాంతాల్లో నిమజ్జనం చేయవచ్చు. కానీ ట్యాంక్‌బండ్ రోడ్డు వైపు నుంచి మాత్రం నేరుగా నిమజ్జనం చేయడానికి అనుమతి లేదు. పీఓపీ విగ్రహాలకు మాత్రం హుస్సేన్‌సాగర్‌లోని నిర్దేశిత ప్రాంతాల్లో కూడా నేరుగా నిమజ్జనం ఉండదు.

**ఎన్టీఆర్ గార్డెన్స్, నెక్లెస్ రోడ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు**

నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎన్టీఆర్ గార్డెన్స్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ తదితర ప్రాంతాల్లో క్రేన్లు, ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తున్నారు. భారీ విగ్రహాలను సురక్షితంగా తరలించి నిమజ్జనం చేసేందుకు అదనపు క్రేన్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ చెరువులు ఏర్పాటు చేస్తున్నారు. సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో బేబీ పాండ్స్ ఏర్పాటు చేయడానికి 2026 ప్రభుత్వ టెండర్‌లోనూ ఏర్పాట్లు ఉన్నాయి.

**16 అడుగుల గణేష్ విగ్రహాల పరిమితి**

ఈ ఏడాది మరో కీలక నిబంధన గణేష్ విగ్రహాల ఎత్తుకు సంబంధించినది. హైదరాబాద్ పోలీసులు విగ్రహాల గరిష్ఠ ఎత్తును 16 అడుగులుగా పేర్కొన్నారు. రవాణా, విద్యుత్ లైన్లు, వంతెనలు, రోడ్డు క్లియరెన్స్, క్రేన్ల నిర్వహణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ పరిమితిని అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే సమయంలో తెలంగాణ పోలీసుల 2026 గణేష్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో 14 అడుగులకు పైబడిన విగ్రహాలకు అదనపు భద్రతా నిబంధనలు వర్తిస్తాయని ప్రత్యేకంగా సూచిస్తున్నారు. అయితే 14 అడుగులే చట్టపరమైన గరిష్ఠ పరిమితి అని ఆ పోర్టల్ పేర్కొనడం లేదు.

**సెప్టెంబర్ 25న ప్రధాన నిమజ్జనం**

చిన్న గృహ విగ్రహాల నిమజ్జనం ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబర్ 16 నుంచి ఎన్టీఆర్ గార్డెన్స్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా, ఐమాక్స్ థియేటర్ లేన్ వంటి ప్రాంతాలకు భక్తులు విగ్రహాలను తీసుకువెళ్తున్నారు. అయితే ప్రధాన గణేష్ మండపాల నిమజ్జనం సెప్టెంబర్ 25న జరగనుంది. ఆ రోజు భారీ స్థాయిలో నిమజ్జన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో పోలీసులు, జీహెచ్ఎంసీ, హైడ్రా తదితర విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాయి. దాదాపు 19 కిలోమీటర్ల ప్రధాన ఊరేగింపు మార్గంలో రోడ్లు, వంతెనలు, విద్యుత్ లైన్లు,



ఇతర క్లియరెన్స్‌లను అధికారులు పరిశీలిస్తున్నారు.

**20 వేల మంది పోలీసులతో భద్రత**

సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో సుమారు 20 వేల మంది పోలీసులను భద్రత కోసం మోహరించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కీలక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, బారికేడ్లు, క్రేన్లు, పడవలు, స్విమ్మర్లు, అంబులెన్స్‌లు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచుతున్నారు. హైడ్రా ఆధ్వర్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, స్విమ్మర్లను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ప్రధాన నిమజ్జన ప్రక్రియ మరుసటి రోజుకు కొనసాగకుండా అదే రోజు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం ఎన్టీఆర్ మార్గ్ వైపు మరిన్ని ప్లాట్‌ఫారాలు, క్రేన్లను ఏర్పాటు చేస్తున్నారు.

**లక్షన్నర విగ్రహాలు.. 50 లక్షల మంది భక్తులు**

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంచనాల ప్రకారం ఈ ఏడాది హైదరాబాద్‌లో సుమారు 1.5 లక్షల గణేష్ విగ్రహాలు లేదా మండపాలు ఉండొచ్చని భావిస్తున్నారు. 2025లో ఈ సంఖ్య సుమారు 1.4 లక్షలుగా ఉందని సమితి పేర్కొంది. దాదాపు 50 లక్షల మంది భక్తులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపింది. నగరవ్యాప్తంగా సుమారు 110 నిమజ్జన ప్రాంతాలు ఉన్నాయని పేర్కొంది. అలాగే గణేష్ ఉత్సవాల ద్వారా సుమారు రూ.6 వేల కోట్ల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయని, లక్షలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తుందని సమితి అంచనా వేసింది. 2025లో జీహెచ్ఎంసీ గణాంకాల ప్రకారం సాయంత్రం 5.30 గంటల వరకు ఆరు జోన్లలో 2.32 లక్షలకు పైగా విగ్రహాల నిమజ్జనం జరిగింది. ఈసారి కూడా భారీ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానుండటంతో అధికార యంత్రాంగానికి సెప్టెంబర్ 25 కీలకంగా మారింది.

**ట్యాంక్‌బండ్‌పై కొనసాగుతున్న చర్చ**

ట్యాంక్‌బండ్‌ను సంప్రదాయ నిమజ్జన ప్రదేశంగా పేర్కొంటూ గణేష్ ఉత్సవ సమితి ఆంక్షలను వ్యతిరేకిస్తోంది. ట్యాంక్‌బండ్ వద్దే నిమజ్జనం నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు పోలీసులు మాత్రం ట్యాంక్‌బండ్ రోడ్డు వైపు బారికేడ్లు, సుమారు 10 అడుగుల రైలింగ్ ఏర్పాటు చేసి, భక్తులను నిర్దేశిత నిమజ్జన కేంద్రాల వైపు మళ్లిస్తున్నారు. అందువల్ల ఈ ఏడాది హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం పూర్తిగా నిలిపివేయడం లేదు. ఏ విగ్రహాన్ని ఎక్కడ నిమజ్జనం చేయాలి? ఏ విగ్రహాన్ని బేబీ పాండ్‌కు తరలించాలి? ఏ మార్గం నుంచి నిమజ్జన కేంద్రాలకు వెళ్లాలి అనే అంశాలపై నియంత్రణ విధిస్తున్నారు. నగరవ్యాప్తంగా 100కు పైగా నిమజ్జన కేంద్రాలను గుర్తించిన నేపథ్యంలో సెప్టెంబర్ 25న సుమారు 1.5 లక్షల విగ్రహాలను ఆయా ప్రాంతాలకు తరలించడం.. ట్రాఫిక్‌ను నియంత్రించడం.. పర్యావరణ నిబంధనలను అమలు చేయడం... భద్రతను కాపాడటం అధికారులకు ప్రధాన సవాలుగా మారనుంది.

## 11 రూపాయిల ఐవీసెట్ 235

ముంబై, రూ. 11 విలువైన ఐవీ సెట్‌ను రూ. 325కి విక్రయిస్తూ దాదాపు 2,800 శాతానికి పైగా లాభం దండుకోవడం.. రూ. 6.75ల సిరంజిలను రూ. 57.20కి విక్రయిస్తూ 747 శాతం మార్జిన్ వేయడం.. రూ. 40 విలువైన నెబ్యులైజర్ మాస్క్‌ను ఏకంగా రూ. 715కి విక్రయించడం.. ఇవన్నీ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలోని 'ప్రైస్ మోనిటరింగ్ రీసోర్స్ యూనిట్' (నిర్వహించిన మార్కెట్ సర్వేలో వెలుగుచూసినగ్భ్రాంతికర విషయాలు. ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి వైద్య పరికరాలు, కన్స్యూమబుల్స్ పేరిట ఏ స్థాయిలో లాభార్జన జరుగుతుందో ఈ నివేదిక స్పష్టం చేసింది.: హర్యానాకు చెందిన మెడిప్లస్ సంస్థ తయారు చేసిన 'మెడిఫ్యూజన్ ఐవీ సెట్' కొనుగోలు ధర రూ. 11.05 కాగా, దానికి ఓఖీఖ రూ. 325గా ముద్రించి ఏకంగా 2,841 శాతం మార్జిన్ దండుకుంటున్నారు లైఫ్‌లాంగ్ మెడిటెక్ సంస్థ తయారు చేసిన 10 ఎశ్రీ సిరంజీ కొనుగోలు ధర రూ. 6.75 కాగా, దాన్ని రోగులకు రూ. 57.20కి విక్రయిస్తున్నారు. కెన్యులా, మాస్కులు: రూ. 22.50 విలువైన ఐవీ కెన్యులాను రూ. 424కి, అలాగే రూ. 45 విలువైన నెబ్యులైజర్ మాస్క్ కిట్‌ను రూ. 652కి విక్రయిస్తున్నారు. ఇతర పరికరాలు: విన్‌జో హెల్త్‌కేర్, రోమ్‌సన్, రిబ్బెల్ వంటి సంస్థలు తయారు చేసే కథేటర్లు, నీడిల్స్ కొనుగోలు ధర కంటే 10 నుంచి 19 రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడుపోతున్నాయి. ఈ అడ్డగోలు దోపిడీని మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారామ్ ముండే తీవ్రంగా ఖండించారు. తయారీదారులు తమ ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్ ఖర్చులు, లాభాలను కలిపిన తర్వాతే ప్రాథమిక కొనుగోలు ధర నిర్ణయమవుతుందని, దానిపై మళ్లీ ఇన్ని రెట్లు ధరలు పెంచడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆసుపత్రి అత్యవసర చికిత్సలో ఉండే రోగులకు ఈ పరికరాల ధరలపై బేరమాడే అవకాశం ఉండదని, అందుకే డ్రగ్స్ ఆర్డర్ 2013 పరిధిలోకి ఈ మెడికల్ పరికరాలను తీసుకొచ్చి ధరలపై పరిమితి విధించాలని కోరుతూ కేంద్ర విలేఖర రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ శాఖ కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. విధానపరమైన చర్యలు తీసుకోవడం ద్వారానే ప్రజలపై పడుతున్న ఈ తీవ్రమైన ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చని స్పష్టం చేశారు.

## కేసీఆర్,హరీశ్‌రావు కుటుంబాల భూముల వివరాలు

హైదరాబాద్ ,తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన సామాన్య ఉద్యమకారులు తమ ఆస్తులు, సర్వస్వాన్ని కోల్పోతే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం వేల కోట్ల రూపాయలు, వందల ఎకరాల భూములను సంపాదించారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కల్వకుంట్ల కుటుంబం, వారి బంధువుల పేరిట 9 జిల్లాల్లోని 24 మండలాలు, 31 గ్రామాల్లో ఉన్న మొత్తం 439.30 ఎకరాల భూములకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్ రెడ్డి సర్వే నంబర్లతో సహా సభలో వెల్లడించారు. ధరణి పోర్టల్ ద్వారా వందల ఎకరాలు దోచుకున్నారని ఆరోపించిన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫాం హౌస్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని, లేకపోతే అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి, మిట్టపల్లి, శివార్ వెంకటా పూర్ ప్రాంతాలలో కేసీఆర్, ఆయన సతీమణి శోభ పేరిట 67.13 ఎకరాల భూమి ఉందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. కేటీఆర్ కుటుంబానికి సంబంధించి కేటీఆర్ పేరిట 49.50 ఎకరాలు, భార్య శైలిమ పేరిట 17.30 ఎకరాలు ఉన్నాయి. కేటీఆర్ కుమార్తె అలేఖ్య పేరిట 9.38 ఎకరాలు, కుమారుడు హిమాన్ష రావు పేరిట 46.30 ఎకరాలతో కలిపి మొత్తం 123.19 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అలాగే కవిత, ఆమె భర్త అనిల్ పేరిట మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 37.26 ఎకరాలు, హరీష్ రావు, ఆయన భార్య పేరిట రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 30.16 ఎకరాల భూములు ఉన్నాయని సీఎం అసెంబ్లీలో చదివి వెల్లడించారు.

**జోగినపల్లి, నవీన్ కుమార్ కుటుంబాల ఆస్తులు**

కేసీఆర్ బంధువులైన జోగినపల్లి కుటుంబంలో రవీందర్ రావు పేరిట ఎర్రవల్లి వద్ద 53 ఎకరాలు భూములుండగా, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఆయన భార్య రోహిణి పేరిట 25 ఎకరాలు కలిపి మొత్తం 79.20 ఎకరాల భూమి ఉంది. 5 జిల్లాల్లోని 12 గ్రామాల్లో ఈ భూములు విస్తరించి ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కొండల్ రావు కుటుంబం పేరిట మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని 9 గ్రామాల్లో 101.14 ఎకరాల భూమి ఉందన్నారు. ఇలా కేసీఆర్ ఆయన సమీప బంధువుల పేరిట 439.30 ఎకరాల భూములు ఉన్నాయని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇదంతా కొల్లగొట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

**కేసీఆర్, వారి బంధువుల భూముల వివరాలు**

కేసీఆర్ కుటుంబం: కేసీఆర్, ఆయన భార్య పేరు మీద సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి, మిట్టపల్లి, శివార్ వెంకటాపూర్ ప్రాంతాలలో 67.13 ఎకరాలు కేటీఆర్ కుటుంబం: కేటీఆర్, ఆయన భార్య శైలిమ, కుమార్తె అలేఖ్య, కుమారుడు హిమాన్ష రావు పేరు మీద సిద్దిపేట, రంగారెడ్డి జిల్లాల్లోని ఎర్రవల్లి, జన్వాడ, మర్కూక్, శివార్ వెంకటాపూర్ ప్రాంతాలలో 123.19 ఎకరాలుకవిత కుటుంబం: కవిత, ఆమె భర్త పేరు మీద మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని 8 మండలాలు, 8 గ్రామాల్లో 37.26 ఎకరాలుహరీష్ రావు కుటుంబం: హరీష్ రావు, ఆయన భార్య పేరు మీద రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని మిట్టపల్లి, నందిపల్లి, రామంచ, అజీజ్‌నగర్ ప్రాంతాలలో 30.16 ఎకరాలుజోగినపల్లి కుటుంబం: రవీందర్‌రావు, సంతోష్‌కుమార్, సంతోష్‌కుమార్ భార్య రోహిణిల పేరు మీద 5 జిల్లాల్లోని 9 మండలాలు, 12 గ్రామాల్లో 79.20 ఎకరాల భూములునవీన్‌కుమార్ - కొండల్‌రావు కుటుంబం: నవీన్‌కుమార్, కొండల్‌రావు పేరు మీద రంగారెడ్డి, , మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని 7 మండలాలు, 9 గ్రామాల్లో 101.14 ఎకరాల భూములు ఉన్నాయిమొత్తంగా చూస్తే 9 జిల్లాలు, 24 మండలాలు, 31 గ్రామాల్లో కలిపి 439.30 ఎకరాల విస్తీర్ణంలో భూమి కేసీఆర్, వారి బంధువుల పేరిట ఉన్నాయని సీఎం రేవంత్ అసెంబ్లీలో ఆరోపించారు.

## పోలవరం ప్రాజెక్ట్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మంత్రి నిమ్మల

ఏలూరు,మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం నాడు పోలవరం ప్రాజెక్ట్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసిఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతి ని అడిగి తెలుసుకున్నారు. మంతరి మాట్లాడుతూ ఈసిఆర్ఎఫ్ డ్యామ్ కు సంబందించి గ్యాప్-1 నిర్మాణ పనులు 49 శాతం, గ్యాప్-2 పనులు 43 శాతం పూర్తి చేశాం. రైట్ కనెక్టివిటీస్ పనులు ఈ నెలాఖరు నాటికి, లెఫ్ట్ కనెక్టివిటీస్ పనులు నవంబర్ నాటికి పూర్తి కానున్నాయి. ఈసిఆర్ఎఫ్ డ్యామ్ పనులు 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యం పెట్టారు. రూ.536 కోట్లతో చేపట్టిన కుడి,ఎడమ గట్ల అనుసంధాన పనులు జరుగుతున్నాయి. 2024 జూన్ తరువాత 10,491 ఎకరాల భూసేకరణ చేసి, నిర్వాసితులకు 2,250 కోట్ల పరిహారాన్ని అందించాం. గత 5 ఏళ్ళ పాలనలో ఒక్క ఎకరం భూమి సేకరించలేదు, నిర్వాసితులకు ఒక్కరూపాయి పరిహారం అందించలేదని అన్నారు. కేంద్రం ఇచ్చిన 3850 కోట్ల రియంబర్స్మెంట్ నిధులును సైతం ప్రాజెక్టుకు గానీ, నిర్వాసితులకు గానీ ఖర్చుచేయకుండా దారిమళ్ళించారు. కూటమి ప్రభుత్వం ముందుగా చెప్పినట్లే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువలను పూర్తి చేసి నీళ్లు విడుదల చేసి దశాబ్దాల కల నెరవేర్చాం. రానున్న 3 ఏళ్లలో 35 వేల కోట్లు ఖర్చు చేసి

## ఆర్థిక వృద్ధిలో రికార్డ్.. సెమీకండక్టర్ రంగంలో దూకుడు..

న్యూఢిల్లీ,ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమికాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ల కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు. సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే 'భారత్ చిప్స్ ప్రపంచానికి వెల్తాయి' అన్నది వాస్తవరూపం దాల్చనుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారతకు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'సెమికాన్ 2.0' కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలు-ముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు. సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమికాన్ 2.0 కింద కనీసం 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85,000 మంది డిజైన్ ఇంజినీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70,000 మందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన సగర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

## రష్యా నుంచి ఆయిల్ కొనొద్దు..

మాస్కో,రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే, అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది.అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. "భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల వైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు.లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ)పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడు తుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి. అయితే, రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ, వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది.

### గట్టిగా బదులిచ్చిన భారత్

అమెరికా హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది.ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని" కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టం వల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

## మల్లారెడ్డి కుటుంబానికి పార్టీలోనే బిగ్ షాక్

హైదరాబాద్,మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు స్థానిక బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన గులాబీ శ్రేణులు, పలు ప్రాంతాల్లో వాటిని చించివేసి నిరసన తెలిపారు.ఐడీపీఎల్, సుచిత్ర ప్రధాన రహదారుల వెంట ప్రీతిరెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో పాటు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చిత్రాలను విస్మరించడం వివాదానికి కేంద్రబిందువైంది. పార్టీ అగ్రనాయకులను పక్కనబెట్టి కేవలం మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి చిత్రాలను మాత్రమే ఫ్లెక్సీలలో ముద్రించడాన్ని స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా తప్పుబట్టాయి. మల్లారెడ్డి కేవలం స్వప్రయోజనాల కోసమే రాజకీయాలు చేస్తున్నారని, అధిష్ఠానాన్ని బేఖాతరు చేస్తున్నారని ఆరోపిస్తూ కార్యకర్తలు ఫ్లెక్సీలను చించివేశారు. భవిష్యత్తులోనూ ఇలాగే ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని మల్లారెడ్డి

# ఉమ్మడి పౌరస్మృతిపై బిజెపి ఉబలాటం

న్యూఢిల్లీ,యూనిఫారం సివిల్ కోడ్ (యుసిసి) అంటే ఉమ్మడి పౌరస్మృతి. దీని ముఖ్య ఉద్దేశం 'అందరికీ ఒకే పౌరచట్టం'. ఇది రాజ్యాంగ నిర్మాతలు భవిష్యత్ తరాల ముందు ఉంచిన ఒక ఆదర్శ లక్షం. దేశం లోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు, ఆచారాలు, సంప్రదాయాలను సమన్వయం చేసి వారందరూ స్వచ్ఛందంగా ఒకే విధమైన చట్టాన్ని అంగీకరించేలా చేయడం చాలా పెద్ద ప్రయత్నమే కాకుండా కష్ట సాధ్యమని ఆనాటి రాజ్యాంగ నిర్మాతలకు ముందే తెలుసు. ఈ విషయంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతవరకు సుసాధ్యం చేయగలుగుతుందో గమనించాల్సిందే. యుసిసిని కేవలం యాంత్రికంగా అమలు చేయడం కాకుండా, రాజ్యాంగ రక్షణలో ప్రతివ్యక్తికి న్యాయం జరిగేలా, సమాజం లోని ప్రతి వర్గాన్ని ఉత్తమమైన పౌర చట్టాల స్థాయికి తీసుకెళ్ల గలగాలి.మైనారిటీలను ఇతరులుగా లేదా పరాయి వారిగా భావించే పరిస్థితి రాకుండా అందరికీ వర్తించే ఉమ్మడి పౌర చట్టాన్ని అమలు లోకి తీసుకు రావాలి. దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఆసక్తిగా ఉంటే వివిధ వర్గాల ప్రజలు, మత పెద్దలు, పౌర సమాజ ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులతో విస్తృతంగా చర్చలు జరపాలి. తన లక్షాలు, ఉద్దేశాల విషయంలో పారదర్శకంగా ఉండాలి. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయానికి వచ్చేలా చేయగలిగితే బిజెపి దేశానికి ఒక మంచి సేవ చేసినట్టు అవుతుంది. అలా కాకుండా రాజకీయ కోణంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలన్న తాపత్రయంతో ఎన్నికల ప్రచార నినాదంగా యుసిసిని వాడుకోరాదు.కానీ ఇప్పటివరకు ఎన్‌డిఎ ప్రభుత్వ చర్యలు గమనిస్తుంటే 2029 పార్లమెంట్ ఎన్నికలకు యుసిసి ప్రధాన ప్రచార అస్త్రంగా వినియోగించుకోనున్నట్టు బయటపడుతోంది. అయితే జాతీయ స్థాయిలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. పార్లమెంట్‌లో ఎన్‌డిఎకు ఉన్న సంఖ్యాబలం దృష్టా ఆ రాజ్యాంగ సవరణ చేపట్టడం సాధ్యం కాదు. అందుకనే తమ ప్రభుత్వ పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లోనే విడతల వారీగా ఈ కోడ్‌ను అమలు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం.ఇప్పుడు దేశ వ్యాప్త చర్చకు తెరతీసినట్టయింది.యూనిఫారం సివిల్ కోడ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నది బిజెపి దీర్ఘకాలిక లక్షాల్లో ఒకటి. బిజెపి ఆవిర్భవించిన నాటి నుంచి యుసిసి అమలు విషయంలో తన విధానాన్ని స్పష్టంగా ప్రకటిస్తూ వచ్చింది. అయితే ఈ కోడ్ ఎలా ఉండాలి? దీని పూర్తి వివరాలు ఏమిటి? తదితర విషయాలను ఇప్పటివరకు బిజెపి వెల్లడించకపోవడం గమనించాల్సిన విషయం. తన కనుసన్నల్లో నడుస్తున్న 21 రాష్ట్రాల్లో యుసిసిని అమలు చేయడానికి బిజెపి సిద్ధమవుతున్నా దీని మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత కనిపిస్తోంది. బీహార్ లోని నితీశ్ కుమార్ సారథ్యం లోని జనతాదళ్ (యునైటెడ్), యుసిసి భావనకు మద్దతు ఇచ్చినప్పటికీ, అమలుకు మాత్రం అంగీకరించడం లేదు. మరో మిత్రపక్షం ఆంధ్రప్రదేశ్ లోని తెలుగుదేశం ప్రభుత్వం కూడా యుసిసి ఆలోచనకు కట్టుబడి ఉన్నామని చెబుతూ దీనిపై మరింత చర్చ




జరగాలని కోరుతోంది. ఈ రెండు మిత్రపక్షాల మద్దతు వల్లనే కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం మనుగడ సాగిస్తోంది. అందువల్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన సూచనకు ఇవి ఎలాంటి షరతులు లేకుండా వెంటనే మద్దతు ఇస్తాయని అనుకోవడం అంత సులభం కాదు. యుసిసి ప్రధాన లక్షం 'సమానత్వం'. ఇది భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కు. అయితే రాజ్యాంగం లోని ఆర్టికల్ 44 న్యాయస్థానంతో నేరుగా అమలు చేయలేని 'ఆదేశిక సూత్రాల్లో' భాగంగా ఉంది. దేశం లోని విభిన్న మతాలు, సమాజాల కోసం చారిత్రకంగా ఏర్పడిన వివిధ వ్యక్తిగత చట్టాలు ఉన్నందున యుసిసి అమలు అనేక అంశాలతో ముడిపడి ఉంది. ఉత్తరాఖండ్ 2024లో యుసిసి చట్టాన్ని అమలులోకి తెచ్చింది. అది వివాహం, విడాకులు, వారసత్వం వంటి అంశాలను నియంత్రిస్తుంది. ఇక్కడ షెడ్యూల్డ్ తెగలకు రాజ్యాంగ పరంగా కొంత మినహాయింపు కల్పించారు. గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం రాష్ట్రాలు కూడా ఇలాంటి చట్టాలను ఆమోదించాయి.రాజస్థాన్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఇలాంటి కోడ్‌లను రూపొందించే ప్రక్రియను ప్రారంభించాయి.వలస పాలన కాలం నుంచే యుసిసి తరహా పౌర చట్టాన్ని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం గోవా మాత్రమే. రాజ్యాంగం లోని ఆర్టికల్ 25 ప్రతి వ్యక్తికి తన మతాన్ని స్వేచ్ఛగా ఆచరించే, ప్రచారం చేసే హక్కును కల్పిస్తుండగా యుసిసి దానికి విరుద్ధంగా ఉండవచ్చన్న అనుమానాలు బలంగా ఉన్నాయి. అలాగే దీన్ని అడ్డం పెట్టుకుని బిజెపి విభజన రాజకీయాలను పెంచుతుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. యుసిసి వల్ల కొన్ని ప్రాథమిక హక్కులు కోల్పోతామన్న ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది. 2022 23లో 22వ లా కమిషన్ యుసిసి అమలుపై ప్రజల, మత సంస్థల అభిప్రాయాలను కోరింది. ఆ కమిషన్ 2024లో ముగిసినా, తుది నివేదిక ఇవ్వలేకపోయింది. దేశంలో మతాలు, తెగలు, ప్రాంతాల మధ్య ఆచారాలు చాలా భిన్నంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వ్యక్తిగత /మత స్వేచ్ఛను, సంప్రదాయ హక్కులను ఎలా కాపాడగలుగుతారన్న అంశం ప్రస్తుతం ముఖ్యమైన చర్చగా సాగుతోంది. ప్రస్తుతం దీనిపై బయటపడుతున్న ఆందోళన గమనిస్తుంటే యుసిసి అనే ప్రాథమిక సూత్రం గురించి కంటే దాన్ని అమలు చేయాలనుకునే ఉద్దేశం పైనే ఎక్కువగా ఉంది.

# 'నూరుశాతం' తప్పుడు చర్య



వాషింగ్టన్:తీసుకునే నిర్ణయాలన్నీ వికటిస్తున్న వైనం కనబడుతూనే ఉన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించే పేరిట ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధించటానికీ... దాన్నుంచి ముడి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా తోడ్పడుతున్న భారత్, చైనాలపై వంద శాతం సుంకాలు విధించటానికీ అనుమతించే బిల్లును ఆయన ప్రభుత్వం ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకుంది. గత నెల ఇదే బిల్లుకు సెనేట్ ఓకే చెప్పింది. తాజా ఆమోదంతో ఈ ఆంక్షల బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ అంగీకారం తెలిపినట్టయింది. దీనిపై ట్రంప్ సంతకం చేశాక చట్టంగా మారుతుంది. ఆ అధికారాన్ని ట్రంప్ వినియోగిస్తారా లేదా అన్నది చూడాల్సివుంది. రెండోసారి అధికారంలోకొచ్చాక రష్యాపై ట్రంప్ విధించదల్చుకున్న ఈ ఆంక్షలు అత్యంత కీలకమైనవి. ఈసారి ఆంక్షలన్నీ రష్యా ఇంధన, రక్షణ రంగాలే లక్ష్యంగా రూపొందించారు. తన అభీష్టానికి విరుద్ధంగా ఇరుగు పొరుగు దేశాలు నిర్ణయాలు తీసుకుంటే వాటితో ద్వైపాక్షిక వాణిజ్యంతోసహా వివిధ బంధాలన్నిటినీ తెంచుకోవటం ఏ ప్రభుత్వమైనా చేసే పని. కానీ 'తన చావు జగత్ప్రళయమ'న్న రీతిలో ఆ పనే అందరూ చేసితీరాలనే డిమాండ్ మూర్ఖత్వం. అంతర్జాతీయంగా 80 ఏళ్ల క్రితం కుదిరిన ఒడంబడిక ప్రకారం దురాక్రమణ యుద్ధాలకు పాల్పడే దేశంపై ఎలాంటి చర్యలు అవసరమో ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి నిర్ణయిస్తాయి. రష్యా తప్పు చేస్తున్నదని అమెరికా భావిస్తే ఆ వేదికలద్వారా ఒత్తిళ్లు తీసుకురావాలి. అలా చేయలేననుకుంటే తనవరకూ ఇష్టానుసారం చేసుకోవచ్చు. అసలు ట్రంప్ అత్యుత్సాహంతో అమలు చేస్తున్న సుంకాల విధానంపై అమెరికాలోనే ఏకాభిప్రాయం లేదు. రష్యాపై కఠిన చర్యల్ని సమర్థిస్తున్న డెమోక్రాట్లు సైతం ట్రంప్‌కు అతిగా అధికారాలు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఏకపక్ష అధికారాలు అప్పగిస్తే దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు.మన దేశం గతంకన్నా దృఢంగా వ్యవహరించటం హర్షించదగ్గది. ప్రస్తుత విధానాన్ని విడనాడబోమనీ, మార్కెట్ చలనాలను నిర్దేశించే ధరవరలు, సరఫరా, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేయడం కొనసాగిస్తామనీ స్పష్టంచేసింది. వంద శాతం సుంకాలపై అమెరికా చర్యకు దిగితే ద్వైపాక్షిక సంబంధాలపై వాటి ప్రభావం పడుతుందని ఇప్పటికే అమెరికాకు తెలియ జేశామని తెలిపింది. అసలు ఈ తీర్మానం చేసే నైతిక హక్కు అమెరికన్ కాంగ్రెస్‌కు ఉందా? ఈ ఆంక్షలు ఒక్కరోజు ఆలస్యమైనా ఉక్రెయిన్‌లో మరింతమంది ప్రజలు మృత్యువుకు బలి అవుతారని తీర్మానం చెప్పడం వంచన. ఈ సూత్రం తనకు వర్తించదా? ఇరాన్‌పై ఇజ్రాయెల్ సాగించిన దురాగతాలను నిలువరించకపోగా, తానూ అందులో పాలుపంచుకుని దేశాధినేతతోసహా అనేకమంది పౌర, సైనిక ముఖ్యుల్ని హతమార్చటం... ఇప్పటికీ పౌర ప్రాంతాలపై బాంబులేస్తూ పదులకొద్దీ మందిని నిత్యం హతమార్చటాన్ని కాంగ్రెస్ ఎలా చూస్తుంది? తీర్మానం చేసేముందు తమ పాలకుడి నిర్వాకమేమిటన్న స్పృహ ఉండొద్దా? తాము అధర్మయుద్ధం కొనసాగిస్తూ ధర్మపన్నాలు వల్లించటం, వేరొకరిని వేలెత్తిచూపటం, అందరూ తననే అనుసరించాలనటం ఏం సబబు?వచ్చేవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికా సందర్శనకు రాబోతున్నారు. ఇరు దేశాలమధ్యా శిఖరాగ్ర సమావేశం జరగబోతోంది. ఇలాంటి సమయంలో ఆంక్షల తీర్మానం తీసుకురావటం, బెదిరింపులకు దిగటం తెలివిమాలిన చర్యగా అమెరికా గుర్తించకపోవటం ఆశ్చర్యకరం. ఇప్పటికే ఏఐ విషయంలో సమష్టిగా కదలాలన్న అమెరికా ప్రతిపాదనను చైనా తోసిపుచ్చింది. ఆ విషయంలో ఇరు దేశాలమధ్యా భిన్నాభిప్రాయాలున్నాయని బయటపడింది. ఈ నేపథ్యంలో మరో వివాదాన్ని రగల్చటం వల్ల ఒరిగేదేమిటి? తన పెత్తందారీ పోకడలతో విసిగిన ప్రపంచం ఇప్పటికే దూరం జరిగిందని అమెరికా గ్రహించటం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడటంలో తెరవెనక తాను నడిపించిన ఎత్తుగడలే కారణమని గుర్తులేదా? అంతర్జాతీయ వేదికల ప్రమేయం లేకుండా ప్రపంచ దేశాలపై ఒత్తిడి తేవటం చట్టవిరుద్ధమని అమెరికా తెలుసుకోవాలి.

# సమన్వయం సాధించేది ఎలా

శ్రీకాకుళం ,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రలో కొనసాగుతోంది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) నేతృత్వంలో పార్టీ కార్యకలాపాలు సాగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలు రాజకీయ చర్చకు కారణమవుతున్నాయి. ఇటీవల పార్టీ అంతర్గత వ్యవహారాలపై పలువురు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి.వైసీపీలో జగన్ తర్వాత పార్టీ వ్యవహారాలను నిర్వహించే విధానం గురించి చాలాకాలంగా రాజకీయ వర్గాల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్ర సమన్వయకర్తగా పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2026లో ఆయన ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటనలు కూడా వెల్లడిస్తున్నాయి.అయితే పార్టీకి సంబంధించిన నిర్ణయాలు క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు ఎంత వేగంగా చేరుతున్నాయి? వారి అభిప్రాయాలు అధిష్ఠానానికి ఎంతవరకు చేరుతున్నాయి? అనే ప్రశ్నలు మాత్రం కొనసాగుతున్నాయి. ఒక రాజకీయ పార్టీ బలంగా ఉండాలంటే అధ్యక్షుడికి క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రత్యక్ష సమాచారం అందడం, నాయకులతో నిరంతర సంప్రదింపులు ఉండటం కీలకంగా మారుతుంది. ముఖ్యంగా ఎన్నికల పరాజయం తర్వాత పార్టీ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించుకోవాల్సిన పరిస్థితిలో ఈ అంశాలకు మరింత ప్రాధాన్యం ఉంటుంది.ఇక జిల్లాల స్థాయిలో కనిపిస్తున్న విభేదాలు వైసీపీకి మరో సవాలుగా మారుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ తాజాగా సొంత పార్టీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లా పార్టీ వ్యవహారాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, తమ్మినేని సీతారాంపై వచ్చిన విమర్శలను జిల్లా నాయకత్వం ఖండించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం వైసీపీలో అంతర్గత విభేదాలపై చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. పార్టీకి సంబంధించిన సమస్యలను అధిష్ఠానం నేరుగా పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌కు పార్టీపై మరింత ప్రత్యక్ష పర్యవేక్షణ, నాయకులతో విస్తృతంగా సంప్రదింపులు, జిల్లాల వారీగా సమస్యలపై సమీక్షలు అవసరమనే చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలకు స్పందించడంతో పాటు సొంత పార్టీలోని అసంతృప్తిని ముందుగానే గుర్తించడం కూడా రాజకీయంగా కీలకమే.

## అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

గుంటూరు, ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

## లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం

తిరుపతి,జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు. కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు. అయినా 34% జీవో ఇవ్వడం వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రభుత్వం తమ వైపు నుంచి 34% అమలుకు సిద్ధపడింది అన్న సందేశాన్ని ప్రజలకు ఇవ్వడం. ఒకవేళ కోర్టు దీనిని అడ్డుకుంటే, మేము ఇవ్వాలనుకున్నాం కానీ న్యాయస్థానాల పరిమితుల వల్ల కుదరలేదు అని చెప్పి బీసీల్లో సానుభూతి సాధించడం. సీలు టీడీపీకి సాంప్రదాయ వెన్నెముక. జీవో ఇవ్వడం, సభలు నిర్వహించడం ద్వారా తమ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని బలంగా స్థాపించడంవైఎస్ జగన్ విమర్శలు కేవలం న్యాయ సూత్రాల గురించే కావు. దాని వెనుక స్పష్టమైన ప్రతిపక్ష వ్యూహం దాగి ఉంది. 2019-2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 50% పరిమితికి లోబడి బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది. అప్పట్లో టీడీపీ దీనిని బీసీల నోళ్లు కొట్టారు అని విమర్శించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34% జీవో ఇస్తే, తాము గతంలో చేసింది కోర్టు నిబంధనల కోసమేనని నిరూపించుకోవాల్సిన అవసరం జగన్‌కు వచ్చింది. అలాగే, రిజర్వేషన్ల వివాదం వల్ల ఎన్నికలు ఆలస్యమైతే, కూటమి ప్రభుత్వం ఎన్నికల నుంచి పారిపోతోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది వైఎస్ఆర్‌సీపీ ఆలోచన.న్యాయ కోణం నుంచి చూస్తే, ఎంపిక చేసిన ప్రాతిపదికన ఎంపిరికల్ డేటా అంటే సామాజిక, ఆర్థిక సర్వే డేటా ఆధారంగా బీసీల వెనుకబాటుతనాన్ని నిరూపిస్తే తప్ప 50% సీలింగ్ దాటడం సాధ్యం కాదు. ఈ విషయంపై ఏపీ హైకోర్టు కూడా ప్రభుత్వం వైపు నుంచి ఆధారాలను, ఎంపిరికల్ డేటాను కోరింది. ప్రత్యేక కమిషన్ల నివేదికలు లేకుండా జీవో ఆధారంగా 50% మించి రిజర్వేషన్లు ఇస్తే, గతం తరహాలోనే న్యాయస్థానాలు దానిని నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏపీ స్థానిక పోరులో బీసీ రిజర్వేషన్ల అంశం చట్టపరమైన సవాలు కంటే రాజకీయ అస్త్రంగా ఎక్కువ ఉపయోగపడుతోంది. 34% కోటాను దక్కించుకోవడం ద్వారా బీసీల గుండెల్లో చెరగని ముద్ర వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంటే.. ఇది సాధ్యం కాని రాజకీయ గిమ్మిక్ అని తేల్చిచెప్పడం ద్వారా టీడీపీ-బీజేపీ-జనసేనల ఇమేజ్‌ను దెబ్బతీయాలని వైఎస్ఆర్‌సీపీ చూస్తోంది.

## రూ. 2 కోట్లు దాటేసిన ఇళ్లు...

హైదరాబాద్ ,హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొనుగోలుదారుల ప్రాధాన్యతలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల క్రెడాయ్, క్రె మ్యాట్రిక్స్ విడుదల చేసిన నివేదికల ప్రకారం.. నగరంలో ఇళ్ల విక్రయ సంఖ్య కంటే విక్రయాల వ్యాపార విలువ గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే సగటు ఇంటి కొనుగోలు ధర ఏకంగా 10 శాతం మేర పెరిగి, రూ.1.85 కోట్ల నుంచి రూ.2.03 కోట్లకు చేరింది. ఏటా సుమారు 2,300 చదరపు అడుగుల సగటు విస్తీర్ణం కలిగిన పెద్ద ఇళ్లకు డిమాండ్ ఉండటమే ఈ సగటు ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచిందిప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌ను పరిశీలిస్తే.. చిన్న సైజు ఫ్లాట్లు లేదా 2ఃఊఖ అపార్ట్‌మెంట్ల కంటే పెద్ద విస్తీర్ణం కలిగిన 3ఃఊఖ, 4ఃఊఖ లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల కొనుగోలుకే నివాసదారులు మొగ్గు చూపుతున్నారు. కరోనా మహమ్మారి తదుపరి ఏర్పడిన వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి, జీవనశైలి మార్పులు , ఐటీ, /కార్పొరేట్ ఉద్యోగుల ఆర్థిక స్థిరత్వం కారణంగా ప్రీమియం, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు డిమాండ్ పెరిగింది. విశాలమైన హాల్స్, హోమ్ ఆఫీస్ స్పేస్, క్లబ్ హౌస్ వసతులు ఉన్న లగ్జరీ గృహాలనే కొనుగోలుదారులు ఎంచుకుంటున్నారు. ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో నగరవ్యాప్తంగా సుమారు 26,000 పైచిలుకు ఇళ్లు అమ్ముడుపోగా, వాటి మొత్తం వ్యాపార విలువ రూ.52,913 కోట్లు దాటాయి.

# వన్ వే' తో చిక్కుల్లేకుండా సాగుతున్న ట్రాఫిక్



హైదరాబాద్, కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళిక మారింది. ఇటీవల ప్రవేశపెట్టిన 'వన్‌వే' విధానం ట్రాఫిక్ సమస్యను చాలావరకు పరిష్కరించడంతో, రూ.1090 కోట్ల విలువైన బహుళ ప్రాజెక్టులను రద్దు చేయాలని అధికారులు భావిస్తున్నారు. వాటి స్థానంలో పంజాగుట్ట నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదించారు. గతంలో కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ఏడు జంక్షన్ల వద్ద సిగ్నళ్ల కారణంగా వాహనదారులు నిమిషాల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. అయితే, నిర్మాణ పనుల కోసం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వన్‌వే విధానం ఊహించని ఫలితాలనిచ్చింది. ప్రస్తుతం వాహనాలు ఎక్కడా ఆగకుండా సాఫీగా ప్రయాణిస్తున్నాయి. దీంతో, వేల కోట్లు ఖర్చు చేసి బహుళ ప్రాజెక్టులు చేపట్టడం అనవసరమని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. కొత్త ప్రణాళిక ప్రకారం, పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవునా ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీనివల్ల ఐటీ కారిడార్ నుంచి పంజాగుట్ట, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనదారులు సిగ్నల్ చిక్కులు లేకుండా నేరుగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త ప్రతిపాదనతో ప్రభుత్వానికి భూసేకరణ, నిర్మాణ వ్యయం రూపంలో రూ.1000 కోట్లకు పైగా ఆదా కానుంది. పాత ప్లాన్ ప్రకారం 237 ఆస్తులను సేకరించాల్సి ఉండగా, కొత్త కారిడార్‌తో ఆ భారం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం విజయవంతంగా నడుస్తున్న కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం యథాతథంగా కొనసాగుతుంది. ఇప్పటికే పనులు మొదలుపెట్టిన చోట్ల వాటిని నిలిపివేసి, రోడ్లను పునరుద్ధరించనున్నారు. ఈ నూతన ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనపై ప్రభుత్వం నుంచి తుది ఆమోదం లభించాల్సి ఉంది.

# తెలంగాణలో తొలిసారి.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు..



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అంతేకాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ అంశమే ఆయన అనర్హత కేసులో కీలకంగా మారింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు విధించడంతో పాటు ఆయనపై స్పీకర్ తీసుకున్న గత నిర్ణయాన్ని పక్కనపెట్టింది. కోర్టు తీర్పు ప్రకారం 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించబడతారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అసలు వివాదం ఏంటి?

2023లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్.. 2024లో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారు. అయితే ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి గెలిచి ఉండగానే మరో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ఆయనపై అనర్హత పిటిషన్లకు దారితీసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ మాత్రం వారి పిటిషన్లను తిరస్కరించారు. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది.

మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల సంగతేంటి?

ఇక్కడే తెలంగాణ రాజకీయాల్లో అసలు చర్చ మొదలైంది. కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కూడా ఫిరాయింపు ఆరోపణలకు సంబంధించి అనర్హత పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. దానం నాగేందర్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆ కేసులపై కూడా రాజకీయంగా ఆసక్తి పెరిగింది. అయితే మిగిలిన ఎమ్మెల్యేలందరిపై కూడా ఇదే తీర్పు తప్పనిసరిగా వస్తుందని ఇప్పుడే చెప్పలేం. ప్రతి కేసులో ఉన్న వాస్తవాలు, ఆధారాలు, పిటిషన్ల స్వభావం, సంబంధిత ఎమ్మెల్యేల చర్యలను విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. అయినప్పటికీ దానం కేసు తీర్పు ఇతర ఫిరాయింపు కేసుల్లో న్యాయపరమైన వాదనలకు ప్రాధాన్యత కలిగించే పరిణామంగా మారింది. బీఆర్ఎస్ నేతలు మాత్రం దానం నాగేందర్‌కు ఎదురైన పరిణామం మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కూడా ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. అందుకే "ఆ 8 మంది ఎమ్మెల్యేల్లో టెన్షన్" అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక?

హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించే పరిస్థితి ఏర్పడింది. దీంతో తదుపరి దశలో ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించిన ప్రక్రియపై ఆసక్తి నెలకొంది. ఉప ఎన్నిక జరిగితే అది కేవలం ఒక నియోజకవర్గ ఎన్నికగానే కాకుండా పార్టీ ఫిరాయింపుల అంశంపై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే రాజకీయ పోటీగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో దానం నాగేందర్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసే అవకాశం ఉందన్న చర్చ కూడా ఉంది. అటువంటి పరిణామం చోటుచేసుకుంటే తదుపరి న్యాయపోరాటం ఎలా సాగుతుందనేది కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి పక్షాలు కూడా న్యాయపరమైన తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నాయి.

తెలంగాణ రాజకీయాలపై ప్రభావం ఎంత?

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక ఎమ్మెల్యేపై అనర్హత వేటు విషయంలో హైకోర్టు నుంచి ఇలాంటి తీర్పు రావడం ఇదే తొలిసారిగా వార్తల్లో నిలిచింది. దీంతో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల కేంద్రబిందువుగా మారింది. దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీర్పు ఒక వ్యక్తి ఎమ్మెల్యే పదవికే పరిమితం కాకుండా పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలపై కొనసాగుతున్న న్యాయపరమైన వివాదాలపై కూడా దృష్టిని మళ్లించింది. ముఖ్యంగా స్పీకర్ నిర్ణయాలను న్యాయస్థానాలు ఎలా పరిశీలించగలవన్న అంశంపై కూడా ఈ తీర్పు చర్చకు దారితీసింది. ఇక ముందున్న రోజుల్లో ఖైరతాబాద్ ఉప ఎన్నికపై ప్రక్రియ, దానం నాగేందర్ తదుపరి న్యాయపరమైన అడుగులు, అలాగే మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుల్లో వచ్చే పరిణామాలు తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశముంది. ప్రస్తుతం మాత్రం దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పు.. పార్టీ ఫిరాయింపుల అంశంలో తెలంగాణ రాజకీయాలకు కీలక మలుపుగా మారింది.

# ఎర్రవల్లి ఫామ్ హౌస్ సర్వే షురూ



హైదరాబాద్,మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపూర్ పరిధిలోని భూములకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. భూముల సర్వే నంబర్లు, పాత రికార్డులు, ప్రభుత్వ భూములు, పట్టా భూముల వివరాలను సేకరిస్తూ రిపోర్టును తయారు చేసే పనిలో అధికారులు పడ్డారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూములపై వాస్తవాలను తేల్చేందుకు విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బుధవారం రోజున అసెంబ్లీలో అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ మొదలైంది. విచారణను 30 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందులో భాగంగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో పాత ఫైళ్లు, రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, పరిసర గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లను పరిశీలించి.. ఆయా భూముల స్వరూపం, యాజమాన్య వివరాలు, గత రికార్డులను సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన వివరాలను వేర్వేరుగా పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా ఫామ్‌హౌస్ పరిధి, దాని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించి 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మొత్తం ఫామ్‌హౌస్ విస్తీర్ణం ఎంత.. అందులో పట్టా భూమి ఎంత.. ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఏ మేరకు ఉంది అనే అంశాలను అధికారులు నిర్ధారించాలని ఆయన ఆదేశించారు. ఫామ్‌హౌస్ మొత్తం విస్తీర్ణంపై కూడా స్పష్టత తీసుకురావాలని సూచించారు. అయితే.. ఈ ఆరోపణలు ప్రస్తుతం అధికారుల విచారణలో ఉన్న అంశాలే కాగా.. 388 ఎకరాల భూమి ఫామ్‌హౌస్‌లో భాగమైందా.. భూముల రికార్డుల్లో ఏవైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా.. అనే విషయాలు విచారణ పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భూముల ప్రస్తుత పరిస్థితితో పాటు గతంలో వాటి పరిస్థితి ఎలా ఉండేదనే విషయాన్ని తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నట్లు సమాచారం. గూగుల్ ఎర్త్ వంటి శాటిలైట్ మ్యాప్‌లలోని పాత చిత్రాలను పరిశీలించి.. గతంలో భూముల వినియోగం ఎలా ఉండేది, ప్రస్తుతం ఏమైనా మార్పులు చోటుచేసుకున్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పాత రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లు, భూముల ప్రస్తుత స్థితి, శాటిలైట్ చిత్రాలను సమన్వయం చేసి అధికారులు వాస్తవ పరిస్థితిని అంచనా వేయనున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే నోటీసులు జారీ చేసినట్లు అధికారికంగా నిర్ధారిత సమాచారం వెలువడే వరకు దీనిని ఖరారు చేయడం సరికాదు. అధికారులు రికార్డుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు, భూములపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేస్తున్నారు. భూముల వివరాలను అధికారిక రికార్డులు, ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇరు కుటుంబాల ఆస్తులపై న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ జరపాలని సవాల్ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రెవెన్యూ అధికారులు సేకరిస్తున్న రికార్డులపై ఆసక్తి నెలకొంది. ఫామ్‌హౌస్ పరిధిలోని భూముల్లో ఏవి పట్టా భూములు, ఏవి ప్రభుత్వ భూములు, ఏమైనా అసైన్డ్ భూములు ఉన్నాయా.. రికార్డుల్లో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి మధ్య ఏమైనా తేడా ఉందా వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

# కాలం ఎంత సిత్రమైనది ? అప్పట్లో ఈటల.. ఇప్పుడు కేసీఆర్



హైదరాబాద్,కాలం చానా సిత్రమైంది సిద్దప్పా.. అంటూ త్రివిక్రమ్ సినిమాల్లో ఆ పేరుతో ఉండే పాత్రకు తత్త్వ బోధన చేయటం.. దానిని సరదాగా సోషల్ మీడియాలో మీమ్స్ కు వాడటం తెలిసిందే. కేసీఆర్ భూములపై సీఎం రేవంత్ చేసిన సంచలన వ్యాఖ్యల నేపథ్యంలో వచ్చిన ఒక వ్యాఖ్య ఆకర్షించేలా ఉంది. భిన్న సమయాల్లో చోటు చేసుకునే కొన్ని పరిణామాల్ని పోల్చి చెప్పటం కనిపిస్తుంది. ఇప్పుడు అలాంటిదే తెలంగాణ రాజకీయాల్లో కనిపిస్తుందన్న మాట వినిపిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేయటం.. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్ దాదాపు 700 ఎకరాల మేర విస్తరించి ఉందని.. అందులో 388 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూములు కలిసిపోయినట్లుగా ఆరోపించటం తెలిసిందే. సీఎం అసెంబ్లీ ప్రకటన వెంటనే జిల్లా కలెక్టర్ మొదలుకొని రెవెన్యూ అధికారులు భూముల లెక్కలు తేల్చేందుకు రంగంలోకి దిగిన వేళ.. కొందరు గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. తన మంత్రివర్గంలో కీలక మంత్రిగా వ్యవహరించే ఈటల రాజేందర్ విషయంలో సీఎంగా ఉన్న వేళ కేసీఆర్ ఇదే తరహాలో వ్యవహరించారని..తాజాగా ఆయన ఇప్పుడు అలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నట్లుగా గుర్తు చేసుకుంటున్నారు. సొంత మంత్రి విషయంలో సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ వ్యవహరిస్తే.. ప్రతిపక్ష నేత విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ తీసుకున్న నిర్ణయం గతాన్ని గుర్తు చేసేలా మారింది. 2021 ఏప్రిల్ - మే నెలల్లో చోటు చేసుకున్న నాటి వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ పై వరుసగా భూఆక్రమణ ఆరోపణలు రావటం..ఆయన్ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయటం తెలిసిందే. ఈ వివాదానికి సంబంధించి అప్పట్లో వినిపించిన ప్రధాన ఆరోపణ.. ఈటల కుటుంబానికి చెందిన జమునా హ్యాచరీస్ సంస్థ కోసం పేదలకు కేటాయించిన దాదాపు 100 ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా కబ్జా చేశారని సీఎంవోకు కంప్లైంట్ చేసినట్లుగా పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో మెదక్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ టీంలు రాత్రికి రాత్రే విచారణ చేయటం.. సుమారు 85 ఎకరాల అసైన్డ్ భూమిని జమునా హ్యాచరీస్ ఆక్రమించినట్లుగా.. అనుమతులు లేకుండా గోదాములు నిర్మించినట్లుగా రిపోర్టులు ఇవ్వటం తెలిసిందే. ఓవైపు మెదక్ వివాదం నడుస్తున్న సందర్భంలోనే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట మండలం దేవరయాంజల్ లోని శ్రీసీతారామ స్వామి దేవాలయ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. అక్కడ భూములకు సంబంధించి దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువైన భూములను ఈటల రాజేందర్.. ఆయన అనుచరులు ఆక్రమించుకున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు.. ముందస్తు అనుమతులు లేకుండా భారీ కమర్షియల్ గోదాలు.. విలాసవంతమైన గెస్టు హైస్ లు నిర్మించినట్లుగా నలుగురు ఐఏఎస్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ వేసి విచారణ జరిపించారు. ఇదే సమయంలో మేడ్చల్ జిల్లా పరిధిలోని రావల్ కోల్ గ్రామానికి చెందిన ఒకరు చేసిన ఫిర్యాదుతో ఈటల అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని కబ్జా చేసిన ఆరోపణలు రావటంతో విజిలెన్స్ తో విచారణకు ఆదేశించారు. అప్పట్లో తనపై వచ్చిన ఆరోపణల్ని ఈటల దంపతులు తీవ్రంగా ఖండించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని.. రాజకీయ కక్షసాధింపు తో ఇలా చేస్తున్నట్లు ఆరోపించారు. ఆ సందర్భంలోనే ఈటలను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయటం అప్పట్లో రాజకీయ సంచలనంగా మారింది. అనంతరం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి.. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించటం తెలిసిందే. కట్ చేస్తే.. తాజా పరిణామాల్ని చూస్తే.. ఇంచుమించు ఇదే తరహా ఆరోపణలతో సీఎం రేవంత్ విచారణకు ఆదేశించటం తెలిసిందే. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం సమీప పరిసరాల్లో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి విచారణ.. రికార్డుల పరిశీలన చేపట్టారు. ఎర్రవల్లితో పాటు పొరుగు గ్రామాలైన వెంకటాపురం.. వరదరాజుపురం సరిహద్దుల పరిధిలోని సర్వే నంబరు 325 మీద అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లు చెబుతున్నారు. ఫామ్ హౌస్ విస్తరణలో భాగంగా దాదాపు 388 ఎకరాల ప్రభుత్వ.. అసైన్డ్ భూముల ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. రెవెన్యూ అధికారులు ఎర్రవల్ల పరిసర భూముల్లో కొలతలు వేయటం.. సర్వే చేసే ప్రయత్నం చేయగా.. స్థానిక రైతులు అడ్డుకోవటం కనిపించింది. వీటిని పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు తమ పని తాము చేసుకుపోయినట్లుగా మీడియా రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. కాలం మహా సిత్రమైందని.. అప్పట్లో ఈటలకు ఎదురైన అనుభవం లాంటిదే తాజాగా కేసీఆర్ కు ఎదురైనట్లుగా రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

# ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా .. అక్టోబర్ 9న పోలింగ్..!



హనుమకొండ చౌరస్తా,ఆర్టీసీలో ఎన్నికల నగారా మోగింది. సుమారు ఎనిమిదేళ్లుగా అందరూ ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం(యూనియన్) ఎన్నికలకు ఎట్టకేలకు ఆర్టీసీ యాజమాన్యం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర కార్మిక శాఖ అధికారికంగా విడుదల చేసింది. అక్టోబర్ 9న పోలింగ్, 17న ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. సెప్టెంబర్ 21వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న ఓటింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 17న ఓట్ల లెక్కింపు పూర్తిచేసి విజేతలను ప్రకటించనున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది. దాంతో.. వరంగల్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో(హనుమకొండ, వరంగల్-1, వరంగల్-2, నర్సంపేట, పరకాల, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, తొర్రూరు) యూనియన్ల సందడి, ప్రచారం ముమ్మరమైంది. చివరిసారిగా ఆర్టీసీలో 2018లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు 2026 గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ముందుగా గుర్తింపు కార్మిక సంఘం కోసం ఎన్నికలు జరిపి.. అనంతరం ప్రభుత్వంలో విలీనం చేపడతామని ప్రభుత్వం తెలిపింది. ఆర్టీసీ ప్రభుత్వ విలీన ప్రక్రియ నేపథ్యంలో ఈ గుర్తింపు సంఘం ఎన్నికలు అత్యంత కీలకంగా మారడంతో సంఘాల మధ్య తీవ్ర పోటీ నెలకొననుంది.

గెలిస్తేనే గుర్తింపు

ఆర్టీసీ సంస్థలో పలు కార్మిక సంఘాలు, యూనియన్లు ఉన్నాయి. అయితే ఎన్నికల్లో విజయం సాధించిన సంఘాలనే చట్టబద్ధమైన గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ ఎన్నికలను ప్రాంతీయ, రాష్ట్రస్థాయిల్లో వేర్వేరుగా నిర్వహిస్తారు. ఈ రెండు స్థాయిలకు సంబంధించి ఓటర్లకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలను అందిస్తారు. కార్మికుల హక్కుల రక్షణలో గుర్తింపు సంఘానిదే ప్రధాన పాత్ర. ఆర్టీసీ కార్మికుల వేతనాల పెంపు, సీఆర్‌తో పాటు జీతాల సవరణ, బోనస్లు, కరువు భత్యం(డీఏలు), పెండింగ్ బకాయిలు, సర్వీసు నిబంధనలలో మార్పులు, డిపోల పనివేళలు వంటి అత్యంత కీలకమైన సంఘానికి నేరుగా ఆర్టీసీ యాజమాన్యంతో, ప్రభుత్వంతో అధికారిక చర్చలు జరిపే ఏకైక చట్టబద్ధమైన హక్కు ఈ యూనియన్‌కే దక్కుతుంది. కార్మికుల సంక్షేమానికి సంబంధించి యాజమాన్యంతో చట్టబద్ధ ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ఆర్టీసీలో పనిచేసే వరంగల్ రీజియన్‌స్థాయి అధికారి

# ఎవరికి వారే యమునా తీరే... బీజేపీ ఎమ్మెల్యేలు రూటే



హైదరాబాద్,తెలంగాణలో అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని చెప్పుకునే భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో అంతర్గత కుమ్ములాటలు, సమన్వయ లోపం తీవ్రంగా వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదగడానికి రాజకీయంగా ఎంతో సానుకూల వాతావరణం, ప్రజల్లో ఆదరణ కనిపిస్తున్నప్పటికీ.. పార్టీలోని నేతల వైఖరి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటోంది. ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకోవడం, అంతర్గతంగా గోతులు తవ్వుకోవడం వంటి పరిణామాలు పార్టీ ఎదుగుదలకు ప్రధాన అవరోధంగా మారుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి ఈ వాదనలకు మరింత బలాన్ని చేకూర్చింది. అసెంబ్లీలో ప్రభుత్వంపై సమష్టిగా పోరాడి, ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంలో ఉమ్మడి వ్యూహం పూర్తిగా కొరవడింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తున్న తరుణంలో, కొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లలో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. మరికొందరు సభ్యులు సభ సాక్షిగానే మంత్రులపై బహిరంగంగా పొగడ్తల వర్షం కురిపించడం సొంత పార్టీ శ్రేణులకే విస్మయం కలిగించింది. ముఖ్యంగా విధానపరమైన నిర్ణయాలపై కూడా బీజేపీ ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కనిపించలేదు. కీలకమైన డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో ఒక ఎమ్మెల్యే వ్యతిరేక గళం వినిపిస్తే, మరో ఎమ్మెల్యే అదే వేదికపై స్వాగతిస్తూ మాట్లాడటం తీవ్ర సమన్వయ లోపాన్ని బహిర్గతం చేసింది. ప్రజా సమస్యలపై పోరాటాల్లోనూ ఇదే ఒంటెద్దు పోకడ కనిపించింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంటల బీమా పథకం అమలు కోరుతూ అసెంబ్లీకి వినూత్నంగా ట్రాక్టర్‌పై ర్యాలీగా రాగా, ఆ నిరసనలో తోటి ఎమ్మెల్యేలెవరూ పాలుపంచుకోకపోవడం పార్టీలోని విభేదాలను స్పష్టం చేసింది. సమావేశాల ప్రారంభం నుంచి ప్రభుత్వం బీజేపీ పట్ల వ్యవహరించిన తీరుపై పార్టీ నాయకత్వంలో అసంతృప్తి వ్యక్తమైంది. మొదటి మూడు రోజుల పాటు బీజేపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించడం, ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోగా ఎదురుదాడి జరగడంతో ఆఖరి రోజు సభను బహిష్కరించాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఈ నిర్ణయంపై ఎమ్మెల్యేలంతా ఏకతాటిపైకి రాలేకపోయారు. పార్టీ వ్యూహాన్ని లెక్కచేయకుండా నాలుగో రోజు కొందరు ఎమ్మెల్యేలు యథావిధిగా సభకు హాజరయ్యారు. ఒక ప్రజాస్వామ్య వేదికపై పార్టీగా నిలబడాల్సిన కీలక సమయంలో ఇలాంటి క్రమశిక్షణా రాహిత్యం బహిర్గతం కావడం రాజకీయంగా బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది. తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు దీటైన ప్రతిపక్షంగా అవతరించేందుకు బీజేపీకి విస్తృతమైన అవకాశాలున్నాయి. అయితే, సమర్థవంతమైన నాయకత్వ నిర్మాణం లేకపోవడం, ఉన్న నేతలు కలిసికట్టుగా అడుగులు వేయకపోవడం పార్టీకి శాపంగా మారుతోంది. అసెంబ్లీ వేదికగా ప్రజల పక్షాన నిలబడాల్సిన వేళ.. తమ స్వప్రయోజనాలు, భిన్నాభిప్రాయాలకే ప్రాధాన్యం ఇస్తున్న తీరు క్షేత్రస్థాయి కార్యకర్తలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. అసెంబ్లీ సాక్షిగా బట్టబయలైన ఈ అంతర్గత విభేదాలు, వ్యక్తిగత ఎజెండాలు ఇలాగే కొనసాగితే.. ప్రజల్లో పార్టీపై విశ్వసనీయత సన్నగిల్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140